యదార్థగాథ

# 108 తుపాకి గుళ్ళకు కూడా బలికాని గూఢచారి

"ఈ కె.జి.బి. ఏజంట్‌ను చంపేయండి. నాలుగున్నర సంవత్సరాల ఇంటారోగేషన్‌లో చాలా పిండగలిగాం. ఇక వీడు బ్రతకడం అనవసరం. డెత్ సెల్‌లోనే షూట్ చేసి మరీ చంపేయండి'' ఆర్డర్స్ జారీ చేసాడు అమెరికన్ సీక్రెట్ పోలీస్ డైరెక్టర్.

ఆ మరుక్షణం డెత్ స్క్వాడ్ ఆ ఏజెంట్ వైపు తీక్షణం చూసింది. డెత్ సెల్‌లో బాగా చిక్కిపోయిన ముప్పయి ఏళ్ల రష్యన్ గూఢచారి తనకు మరణశిక్ష విధించినందుకు పిచ్చిగా జుట్టు పీక్కున్నాడు. ఆ వెంటనే సెల్ తలుపులు తెరవబడ్డాయి.

లోపలికి డెత్ స్క్వాడ్ మనుషులు నలుగురు ఆటోమేటిక్ గన్స్‌తో చొచ్చుకువెళ్లారు. కేవలం అమెరికాలో కొన్ని అత్యంత కీలకమైన రహస్యాలకోసం ఐదేళ్ల క్రితం రహస్యంగా ప్రవేశించి ఆరు మాసాల్లో దొరికిపోయి భయంకరమైన ఇంటారోగేషన్ గురయి, ఒక్క నిజం కూడా వెల్లడించకుండా జాగ్రత్త పడగలిగాడు. చెప్పిన అబద్ధాన్నే మళ్లీ మళ్లీ ఏ మాత్రం మరువకుండా చెప్ప గలిగాడు. దాంతో ఈ గూఢచారి వద్ద సమాచారం ఇంతేలే అనుకుని పైగా, పూర్తిగా పిసిగిపోయి చంపమని ఆర్డర్స్ వేసారు.

ఆ ఏజంట్‌ను ఆ సెల్‌లో ఒక మూలకు నిటారుగా నెట్టేసి గన్స్ గురి పెట్టారు. ఆ గూఢచారి పెదాలు బిగించి కళ్లు మూసుకున్నాడు. ఫైర్ ఓపెన్ చేసారు.

"ధడ ధడ ధడ ధడ ధడ ధడ ధడ'' మని నిప్పులు చెణుక్కుంటూ 'గుళ్లు' ఆ గూఢచారి శరీరంలో చొచ్చుకుపోయాయి. నెత్తురు గడ్డగా మారిపోయి నేల మీద నిరుసుకుపడ్డాడు. ఆ సెల్ అంతా పొగలతో నిండిపోయింది. స్క్వాడ్ మనుషులు' సెల్‌లోంచి నిశురుగా వెళ్లిపోయారు. తలుపులు బార్లా తెరవబడి అలానే ఉండిపోయాయి.

★★ ★★ ★★ ★★

1972 మే 1వ తేది తెల్లవారు జామున గూఢచారి చంపబడ్డాడు. ఒక గంట గడిచాక ఆ సెల్‌లోకి ఒక స్ట్రెచ్చర్‌తో నలుగురు స్క్వాడ్ మనుష్యులు వచ్చి శవాన్ని మోసుకు వెళ్లారు. తరువాత గదంతా ఎండిన రక్తపుధారాల్ని నీళ్లతో వాష్ వేయడానికి మరో ఇద్దరు వచ్చారు. ఆ ఇద్దరిలో ఏదో ఒక చెప్పుకోలేని బాధ సన్నగా గుండెల్ని కెలికింది. నాలుగున్నర ఏళ్లుగా ఇదే సెల్‌లో నరకయాతన అనుభవించి నేడు దారుణంగా హత్య చేయబడినందుకు వారిలో చాలా బాధ కల్పించింది.

అమెరికా సీక్రెట్ సర్వీస్ విదేశీ గూఢచారుల్ని పట్టు బెట్టినప్పుడు పాతిపెట్టి చేతులు దులుపుకోరు. ఒక ఫైలు తయారు చేసి అతని నుంచి రాబట్టినదంతా ఫైలు చేసి చివరకు చంపేసిన తరువాత పోస్టు మార్టమ్ రిపోర్టు కూడా జాగ్రత్తగా భద్రపరుస్తారు.

ఈ నేపథ్యంలో....

గూఢచారి శవం రహస్యంగా ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపబడింది. అక్కడ మిగిలిన శవాలకు జరిగేట్టు పోస్టు మార్టమ్ తంతు జరగదు. సీక్రెట్ పోలీస్ వారికి కావల్సిన పద్ధతుల్లో జరుపుతారు. అందుకని శవాన్ని మార్చురీలో భద్రపరిచారు.

మధ్యాహ్నం సీక్రెట్ పోలీస్ డైరెక్టర్ నుంచి ఆదేశాలు అందాయి. గూఢచారి బాడీలో ఏమైన విరిగిన ఎముకలకు బదులు స్టీలు రాడ్స్ వేయబడ్డాయా? అలా అయితే ఆ స్టీలు రాడ్స్ వెలికి తీయాలి. బ్లడ్ గ్రూప్, శరీరంపై కుట్లు పడ్డప్పుడు, సూక్ష్మంగా ఉండే చిన్న ప్లాస్టిక్ మైక్రో ఫిలిమ్ డబ్బీలున్నాయేమో గమనించమని ఉంది

ఆదేశాల పత్రం పరిశీలించిన సూపరింటెండెంట్ పోస్టు మార్టమ్ చేసే డాక్టర్‌కు తెలియడానికి గాను ఆ పత్రం మార్చురీలో గూఢచారి శవంపై ఉంచే ఏర్పాటు చేసాడు.

సాయంత్రం నాల్గింటికి పోస్టుమార్టమ్‌కు రంగం సిద్ధం చేయబడింది. స్టాఫ్ నర్సు ఒకామె మార్చురీలోకి వెళ్ళి ప్రతి గంటకు శవాల పరిస్థితి సమీక్షించడం డ్యూటీ అయినందున యధాలాపంగా మూడింటికి వెళ్లింది.

గూఢచారి శవం లోంచి అతిహీనంగా మూలుగు వినిపించింది. వెను దిరిగి వచ్చేస్తున్నామె కాస్త ఆగి చెవులు రిక్కించింది. స్పష్టంగా తాను వింటోంది. 'ఈ శవం ఇంకా చావకుండానే మార్చురీకి వచ్చేసింది. మైగాడ్' అని నిశితంగా పరిశీలించింది. కనురెప్పలు ముడిపడ్తున్నాయి. శరీరం నిండా తుపాకీ గుళ్ళతో నిండి ఉన్నాయి.

ఒక్క గుండుతో ప్రాణం పోవాల్సింది. వీడి శరీరంలో సుమారు ఒక వందకు పైగా గుళ్ళు జల్లెడలా చొచ్చుకుపోతే, ఇంకా మూలుగుతాడేంటి అని సంభ్రమాశ్చర్య పడసాగింది.

~~ఆ శవంపై గల పత్రం చూసి కె.జి.బి.~~ ఏజెంటుగా గుర్తించింది. ఆ నర్సులో ఏ మూలనో కె.జి.బి. పట్ల అభిమానం దాగి ఉండడం వలన పైగా బ్రతికించడానికి పూనుకుంటే ఎలా ఉంటుందని కొద్ది క్షణాలు ఆలోచించింది. ఇలాంటి మృత్యుంజేయుల్ని బ్రతికించడానికి కొద్ది సహాయం చేసినా ఈ గట్టి పిండాలు బ్రతికి బట్టకడ్తాయి— అని ఒక దృఢ నిర్ణయానికి వచ్చింది.

ఒక్క అరగంటలో ఆ గూఢచారిని మాయం చేయాలి. ఆ స్థానంలో మరో బాడీ పెట్టడం ఇవన్నీ యంత్రంలా పని చేస్తేనే జరుగుతాయి. చకచకా పని ప్రారంభించింది. ఒకసారి పోస్టు మార్టమ్ ఆదేశ పత్రం చదివింది. అందులో ఎక్కడా శరీరంలో తుపాకీ గుళ్లున్నట్లు గాని వాటి వివరాలు గాని కోరి ఉండలేదు. దీనిపై తాను జంతర్ మంతర్ వేయడానికి అవకాశం ఉన్నట్లు క్షణాల్లో తల పదును పెట్టింది.

ఎనిమిదంతస్థుల భవంతిపై నుంచి పడి చనిపోయిన మృతదేహాన్ని గూఢచారి స్థానంలో పెట్టి గూఢచారి శరీరాన్ని గదిలోకి మార్చేసింది. రాత్రి ఏడు గంటల వరకు గూఢచారి మూలుగుతూ బ్రతికుంటే తాను రికార్డులు మార్చి ఎమర్జెన్సీ వార్డులోకి ఎడ్మిట్ చేయడానికి నిర్ణయించుకుంది.

★★ ★★ ★★ ★★


ఏడుగంటలయ్యే సరికి ప్రథమ గండం దాటింది కె.జి.బి. ఏజంట్ పోస్టు మార్టమ్ రిపోర్టు తయారయ్యింది. ఆ రిపోర్టు చదివింది. స్టీల్ రాడ్స్ లేవు. బ్లడ్ గ్రూప్ వివరం ఇవ్వబడింది. ఆదేశాన్ని మరో డాక్టర్ వద్దకు తీసుకువెళ్లి ఎనిమిదంతస్థుల నుంచి క్రింద పడ్డ శవంపై పూర్తి రిపోర్టు తయారు చేయాల్సిందిగా ఇది వరలో ఆదేశమిచ్చిన సూపరెండెంట్ పత్రాన్ని చూపి ఆ రిపోర్టు సేకరించింది.

ఇప్పుడు నర్సు రెండు శవాల రిపోర్టులను ఒక శవం ద్వారా సాధించింది. అమెరికాలో ఒకే శవాన్ని పదిమంది డాక్టర్లనే పోస్టుమార్టమ్

# యర్నాగుల సుధాకరరావు

వేయించిన ఉదంతాలు కోకొల్లలు. అందుకే ఏ డాక్టర్ పట్టించుకోడు.

తిరిగి మార్చురీలోకి వచ్చిన నర్సుకు గూఢ వారిని చూసేసరికి మరింత ఆశ్చర్యం వేసింది. స్పష్టంగా వినిపించేట్టు ఊపిరి పీలుస్తున్నాడు. కళ్లు తెరుస్తూ మూస్తున్నాడు. 'మై గాడ్ వీడు గట్టి పిండమే బ్రతికి తీరతాడు. ఇది వైద్యశాస్త్రంలో అపూర్వంగా నిలిచిపోతుంది అని అనుకుంది.



ఎమర్జెన్సీ వార్డులో చేర్పించింది.

డాక్టర్స్ గూఢచారి పరిస్థితి సమీక్షించి ఆశ్చర్యపడ్డారు. ఎనిమిది గంటలు పాటు శ్రమించి శరీరంలో చిక్కుకున్న 108 గుళ్లను వెలికి తీసారు. అవసరమైన రక్తం ఎక్కించారు. ఒళ్లంతా పోల్చుకోని విధంగా బాండేజీలతో ఆ గూఢచారి మిగిలాడు.

రెండు నెలల పాటు ఆసుపత్రిలో కంటికి రెప్పలా కాపాడబడ్డాడు.

పూర్తిగా కోలుకున్న కె.జి.బి. ఏజంటు తాను పెక్కు గుళ్లకు గురయి ఏ విధంగా బ్రతికానా అని జవాబు లభించని ప్రశ్నతో సతమతమవుతూ ఇక అట్టే ఇక్కడ ఉంటే తనకు ప్రమాదం తప్పదు అని తెలివిగా పారిపోయాడు.

ఆ వార్డులో పేషెంట్ మిస్ కావడంతో డాక్టర్స్ పోలీస్ రిపోర్టు ఇచ్చారు. అప్పుడు మొత్తం విషయం బయటపడింది. అయితే, తొలి రోజునే 108 గుళ్లకు బలికాని మనిషి గూర్చి పత్రికలకు తెలియ చేయాలనుకున్నప్పుడు పోలీస్ అధికార్ల నుంచి ఫోన్ రావడంతో ఆగినట్లు సీక్రెట్‌గా ట్రీట్‌మెంట్ కావాలని ఆ అధికార్లు కోరినట్లు ఆ ఫిర్యాదులో డాక్టర్లు పేర్కొన్నారు. తీరా ఆ విధంగా ఫోన్‌ల్లో చెప్పింది ఎవరూ కాదు ఆ గూఢచారిని కాపాడిన నర్సు అని డాక్టర్లకు తెలియదు.

మొత్తం వ్యవహారం పై దర్యాప్తు కొనసాగింది నర్సు పాత్ర బయటపడింది. ఆమెను అరెస్టు చేసి కోర్టులో నిలిపితే విదేశీ గూఢచారికి సాయపడడం పై పన్నెండు సంవత్సరాలు జైలుశిక్ష వేసింది కోర్టు. అయితే కొన ప్రాణం ఉన్నవారిని రక్షించే మనస్తత్వం ఉన్నందున కోర్టు అభినంది స్తూ జైలు జీవితాన్ని జైలులో గల ఆసుపత్రికి బదలాయించి అక్కడ పన్నెండు ఏళ్లు నర్సుగా పని చేయడానికి, ఆదేశించింది. ●